క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధిత చిన్నారికి సాయం



అగ్నిప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న బేడ బుడగ జంగాల నాయకులు

పెరవలి: గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కళ్యాణి మౌనిక కుటుంబానికి బేడ బుడగ జంగాల ఆలిండియా సంఘ సభ్యులు రూ.లక్ష రూపాయలు నగదు మంగళవారం అందించారు. మోతే బిక్షం మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాపకు చికిత్స నిమిత్తం తమ వంతు సహాయం చేశామని తెలిపారు. తమ కులంలో ఎవరైనా ఆపదలో ఉంటే ఈ విధంగానే సహాయ సహకాలు అందిస్తున్నామని తెలిపారు. పాప కళ్యాణి త్వరగా కోలుకోని కోరారు. ప్రస్తుతం పాప కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో గత రెండు నెలలుగా చికిత్స పొందుతూ ఉందని స్థానిక నాయకుడు పేర్ల నాగులు తెలిపారు. కార్యక్రమంలో మిరియాల వెంకట్, బయలుపాటి తుకారం, తోరపాటి మారేష్, విబూది దుర్గారావు, కర్రి ఏసోబు, కళ్యాణి వెంకటేశ్వరరావు, మోతే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతలంతా హైదరాబాద్ తరలి రావాలి

నిడదవోలు రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న చలో హైదరాబాద్ పేరిట తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నేతలంతా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాలింకి రాము పిలుపునిచ్చారు. మండలంలోని సమిశ్రగూడెం బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ డప్పు తమ వెంట తీసుకు రావాలని రాము కోరారు. కార్యక్రమంలో బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి రాజారత్నం, కార్యదర్శి కొల్లి శ్రీను, నాయకులు తాతపూడి జగదీష్, గెడ్డం రవీంద్ర బాబు, ఎం.సువర్ణరాజు, ఎం.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నిడదవోలు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు, చిన్నారులకు రోగనిరోధక టీకాలు వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలతో సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎ.రాజమోహన్, రమణ, మురళీకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



అధికారులతో సమావేశమైన సీఈఓ సుబ్బారావు

తాళ్లపూడి: వేసవిలో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల నిర్వహణ, గ్రామాల్లో శుద్ధి చేసిన గోదావరి నీరు సరఫరా తదితర అంశాలపై చర్చించారు. అధికారులు తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ టీబీ వెంకట రమణ, ఎంఈఓ సీహెచ్ బాలామణి, ఎంఈఓ-2 సీహెచ్ నెహ్రూజీ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్‌సూర్జాన్, ఈఓపీఆర్డీ కేఎస్ వీరన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీటు కోసం సిగపట్లు

- గోపాలపురం ఏఎంసీ కుర్చీ కోసం ముగ్గురి పైరవీలు
- కూటమి నేతల కుమ్ములాట
- ఎమ్మెల్యే ఆశీస్సులున్న వారికే పదవి



గోపాలపురంలోని ఏఎంసీ కార్యాలయం

దేవరపల్లి: మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపాలపురం మార్కెట్ కమిటీ కుర్చీ కోసం కూటమి నేతలు సిగపట్లు పడుతున్నారు. ఇప్పటికే మూడు మండలాలకు చెందిన ముగ్గురు టీడీపీ సీనియర్ నాయకులు కుర్చీలో కర్చీఫ్ వేసి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. గోపాలపురం ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్(ఓసీ)కి కేటాయించారు. దీంతో టీడీపీలో బలమైన కమ్మ సామాజికవర్గం నుంచి ముగ్గురు నేతలు ఈ పదవిని ఆశిస్తున్నారు. నియోజకవర్గ టీడీపీలో వర్గ పోరు కొనసాగుతూండటంతో ఈ పదవి కోసం కూటమి నేతల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. ఈ కుర్చీ తనకంటే తనకు కావాలని పలువురు పార్టీ నేతలు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అయితే స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆశీస్సులు ఉన్నవారికి మాత్రమే ఈ పదవి దక్కుతుందనేది సత్యం. దీంతో ఆయనపై కూడా ఆశావహులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

ఆశీస్సులు దక్కేదెవరికో..

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఎనిమిది నెలలు కావడంతో నామినేటెడ్ పదవుల కోసం పార్టీ నాయకులు ఆరాటపడుతున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవిని గోపాలపురం మండలం నుంచి కొర్లపాటి శ్రీరామచంద్రం (రాము), దేవరపల్లి నుంచి గన్నమని హరికృష్ణ, దుద్దుకూరు నుంచి ముళ్లపూడి దొరాజీ, నల్లజర్ల మండలం నుంచి యద్దనపూడి బ్రహ్మరాజు ఆశిస్తున్నారు. ఈ నలుగురూ ఎమ్మెల్యే మద్దిపాటికి ముఖ్య అనుచరులే. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన విజయానికి వీరు పని చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వెంకట్రాజు ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో కొద్ది రోజులు వేచి చూడాల్సిందే. నల్లజర్ల మండలానికే పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

1997లో ఆవిర్భావం

మొదట్లో గోపాలపురం నియోజకవర్గం కొవ్వూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉండేది. ఇక్కడి రైతులు కొవ్వూరు వెళ్లి తమ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవలసి వచ్చేది. 1997లో కొవ్వూరు నుంచి ఈ నియోజకవర్గాన్ని వేరు చేసి, గోపాలపురం మార్కెట్ కమిటీ ఏర్పాటు చేశారు. గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి మండలాలు ఏఎంసీ పరిధిలో ఉండేవి. 2021లో తాళ్లపూడి మండలాన్ని తొలగించి, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాలను కలిపారు. నియోజకవర్గం ఒక యూనిట్‌గా ఏర్పాటు చేశారు. మొట్టమొదటి చైర్మన్‌గా గోపాలపురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు నున్న వెంకట మోహన్‌రావు పని చేశారు. అనంతరం ప్రభుత్వాలు మారడంతో దేవరపల్లి మండలానికి చెందిన గడా మురళీ అజిత్ కుమార్, కేవీకే దుర్గారావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, ముళ్లపూడి వెంకట్రావు, ముమ్మిడి వీర వెంకట సత్యనారాయణ, గన్నమని జనార్దనరావు చైర్మన్లుగా పని చేశారు. ముళ్లపూడి వెంకట్రావు హయాంలో మార్కెట్ యార్డుకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. ఆదాయం భారీగా పెరగడంతో ఉత్తమ మార్కెట్ కమిటీగా ప్రభుత్వం అవార్డు అందించింది. పంట ఉత్పత్తుల నిల్వలకు గిడ్డంగుల నిర్మాణం, నిమ్మకాయల మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ప్లాట్‌ఫామ్ నిర్మించారు. దీంతో పాటు పశువుల మార్కెట్ కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ ఏడుగురు చైర్మన్లు పని చేయగా, వీరిలో ఆరుగురు దేవరపల్లి మండలానికి చెందినవారే కావడం విశేషం. ఈసారి గోపాలపురం మండలానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నేతలు గట్టిగా పట్టు పడుతున్నట్లు తెలుస్తోంది.

నాలుగు చెక్‌పోస్టులతో..



మార్కెట్ కమిటీ పరిధిలో గోపాలపురం, యర్నగూడెం, నల్లజర్ల, వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. వీటి ద్వారా వ్యవసాయ ఉత్పత్తులపై సెస్ వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేస్తున్నాం. వరి, మొక్కజొన్న ఉత్పత్తులపై ప్రధానంగా ఆదాయం వస్తోంది. గతంలో జీడి గింజలపై కూడా సెస్ వచ్చేది. స్థానికంగా పంట ఉత్పత్తి తగ్గడంతో ఆదాయం రావడం లేదు. ఐదేళ్లుగా సెస్ ద్వారా రూ.13.18 కోట్ల ఆదాయం వచ్చింది. సెస్ నిధులతో లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పాలకవర్గం పదవీ కాలం మే నెలలో పూర్తయింది. మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ద్వారకా తిరుమల, గోపాలపురం యార్డుల్లో నిమ్మకాయల విక్రయాలు జరుగుతున్నాయి.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి, ఏఎంసీ, గోపాలపురం

2019 నుంచి 2025 జనవరి వరకూ మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయం వివరాలు

సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2019-20	2.02
2020-21	78.93 (రూ.లక్షలు)
2021-22	2.31
2022-23	2.63
2023-24	3.71
2024-25	1.71(జనవరి వరకూ)

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్

కొవ్వూరు: పట్టణంలో రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలో నిడదవోలు వెళ్లే రోడ్డు మార్గంలో గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జి.దేవకుమార్ మంగళ వారం తెలిపారు. పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తన సిబ్బందితో కలిసి వీరిని పట్టుకుని, పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెరవలి మండలం తీపర్రుకు చెందిన మెగళ్లపు నవీన్ కృష్ణ చౌదరి, పెరవలికి చెందిన చిన్నిమిల్లి శివకృష్ణ, అదే గ్రామంలో అరుంధతి పేటకి చెందిన సివరపు ప్రవీణ్, ఆచంటలోని పెదపేటకు చెందిన కొత్తా భాను సందీప్, తణుకు మున్సిపల్ కార్యాలయం వెనుక పాతూరు ప్రాంతానికి చెందిన కాకరపర్తి బాలాజీని అరెస్ట్ చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. సమావేశంలో సీఐ విశ్వం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



నాగమణి

నల్లజర్ల: పోతవరం శివారు కృష్ణాయగూడెంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. జొన్నకూటి నాగదుర్గ(26) భర్త నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వారికి ఐదేళ్ల కుమార్తె చైత్ర ఉంది. వారుంటున్న ఇంటి విషయమై వారితో అత్తమామలు సువార్త, పెద సుబ్బారావు, బావగారు గంగరాజు, ఆడపడుచు పున్నమ్మ తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో నాగదుర్గ కొద్ది రోజుల క్రితం కోమటిగుంటలోని పుట్టింటికి వెళ్లి, కృష్ణాయగూడెం తిరిగి వచ్చింది. మంగళవారం ఉదయం భర్త రాజు పని నిమిత్తం బయటకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నాగదుర్గ మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నర్సింగ్ విద్యార్థులు సేవాదృక్పథంతో పని చేయాలి

- మాజీ హోం మంత్రి తానేటి వనిత



కొండవీటి నర్సింగ్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

గోపాలపురం: నర్సింగ్ విద్యార్థులు సేవాదృక్పథంతో పనిచేయాలని మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గోపాలపురం కొండవీటి నర్సింగ్ కళాశాలలో మంగళవారం నర్సింగ్ క్యాపింగ్ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ కేఎస్‌డీ ఆశీర్వాదం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సేవాదృక్పథంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆసుపత్రుల్లోని నర్సింగ్ సిబ్బందికి రోగులతో ప్రత్యక్ష సంబంధాలుంటాయని వారికి మానవతా దృక్పథంతో సేవలందించాలన్నారు. నర్సింగ్ సిబ్బంది రోగుల విషయంలో సమయానుకూలంగా వ్యవహరించి వారి మన్ననలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె సునీత, జంగారెడ్డిగూడెం నర్సింగ్ సూపరింటెండెంట్ బి కమలకుమారి, డాక్టర్ వి రాంబాబు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, మల్లిపూడి సలీం కొండవీటి డిగ్రీ, జూనియర్ కళాశాల న ర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నియంత్రణ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది



ఉండ్రాజవరంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఉండ్రాజవరం: అవగాహనతోనే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమని ఉండ్రాజవరం, వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆర్.ఉషాదేవి, ఇర్ఫాన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఉండ్రాజవరం, వేలివెన్ను పీహెచ్‌సీల్లో మంగళవారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వివిధ రకాల కేన్సర్లను ముందుగా గుర్తిస్తే, వాటికి సత్వరం చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వై.సృజన, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, కె.కుమారి, హెల్త్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాసరావు, ఎన్‌కే ఖాన్, కె.సుభాషిణి, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలో ప్రభుత్వాసుపత్రి వద్ద ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫయాజ్ అన్సారీ అధ్యక్షతన మంగళవారం ప్లకార్డులతో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఫయాజ్ అన్సారీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాపకింద నీరులా క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తోందన్నారు. ఈ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధిత మరణా ల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలితో పాటు ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు రవికాంత్, వినీల్, అస్మత్, జానకీప్రియా, రెహనా, హెడ్ నర్స్ హెప్సిబా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



ప్రక్కిలంకలో సూర్యానారాయణ మూర్తి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి: రథసప్తమి వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద పాలపొంగులు నిర్వహించి సూర్యనమస్కారాలు చేశారు. సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లేడు ఆకులు, రేగుపండు తలపై పెట్టుకుని ఉదయాన్నే శిరస్నానం చేసి మహిళలు పూజలు నిర్వహించారు. ఈ రోజు నుంచి వేసవి ప్రారంభమవుతుందని అర్చకులు తెలిపారు. సూర్యనమస్కారాలు చేస్తే అనారోగ్యంగా ఉన్న వారి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. దేవరపల్లిలోని సీబీఎస్ కాలనీలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం, షిర్డీసాయి మందిరం వద్ద రథసప్తమి పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఉండ్రాజవరం: రథసప్తమి పండగను మంగళవారం మండలంలో పలు గ్రామాలల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి చిక్కుడుకాయలతో రథాలను తయారు చేసి పూలతో ఆలంకరించారు. ఆవుపాలను పిడకలపై పొంగించి తయారు చేసిన క్షీరాన్నాన్ని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వేలివెన్ను సూర్యాలయంలో కొలువైన సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పాల్గొని అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

చాగల్లు: రథసప్తమి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆయా దేవాలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. చాగల్లులో ధానయ్యబాబు మందిరం వద్ద లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరిస్వామి, బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



దేవరపల్లి సీబీఎస్ కాలనీలోని వినాయకుడి ఆలయం వద్ద సూర్యనమస్కారాలు చేస్తున్న భక్తులు

ప్రక్కిలంకలో వైభవంగా రథోత్సవం

తాళ్లపూడి: మండలంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రక్కిలంకలో నెల రోజుల పాటుగా లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న 16వ సౌరయాగం పూజలు, వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సూర్యనారాయణమూర్తి నామస్మరణతో రథాన్ని ఉత్సాహంగా లాగారు. శశిశేఖర మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెరటి కూరలతో ఆరోగ్యకర సమాజం



వేళ్లచింతలగూడెం అంగన్‌వాడీ సెంటర్ వద్ద పెరటి కూరలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



పోషణ వాటికను సందర్శించిన ఎంపీడీవో కె.సుశీల, సీడీపీవో డి.మమ్మీ

గోపాలపురం: పెరటి కూరగాయలు ఆరోగ్యాన్నిస్తాయని గోపాలపురం సీడీపీవో కె నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం అంగన్‌వాడీ సెంటర్ వద్ద మంగళవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పెరటి కూరగాయలు అందజేశారు. క్రిమి సంహారక మందులు వాడటం వల్ల అనేక అనారోగ్యాలకు గురి అవుతున్నారని అందువల్ల అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న బాలింతలు, గర్భిణులకు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పెరటి కూరగాయలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు అందిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె హేమలత, హెల్పర్ కె కుమారి, నాయకులు ఇల్లూరి పెంటలరాజు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆకు కూరలతో ఆరోగ్యం

కొవ్వూరు: వేములూరు గ్రామంలో 35, 102 నంబర్ గల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ వాటికలను ఎంపీడీవో కె.సుశీల, సీడీపీవో డి.మమ్మీ సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే అవగాహన సదస్సుకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరు కానున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈ సదస్సుకి కూటమి నేతలంతా హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజ శేఖర్‌ను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో 7, 8, 9 సచివాలయాల పరిధిలో సిబ్బందిని, గ్రాడ్యుయేట్స్‌ను కలిసి మొదటి ప్రధాన ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు.

విద్యుత్ తీగలు తగిలి మహిళకు తీవ్రగాయాలు

దేవరపల్లి: కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి దేవరపల్లి మండలం యర్నగూడెంలో వ్యవసాయ మహిళా కూలి ధర్మవరపు సత్యవతి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ధర్మవరపు సత్యవతి వ్యవసాయ కూలీగా పనిచేస్తుంది. మంగళవారం వరి చేలో పనికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో నేలకు సుమారు 5 అడుగుల ఎత్తున వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తూ ఆమె తలకు తగలడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ బొంతా భరత్‌బాబు ఆసుపత్రికి వెళ్లి సత్యవతిని పరామర్శించి వైద్య ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు. సత్యవతి ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

హాస్టల్‌లో ప్రార్థన నిర్వహణపై ఆర్డీవో విచారణ



వసతి గృహంలో సిబ్బందిని విచారిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: పట్టణంలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఆదివారం క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహణకు సంబంధించిన వీడియోలు బయటికి వచ్చిన అంశంపై ఆర్డీవో రాణి సుస్మిత మంగళవారం రాత్రి విచారించారు. హాస్టల్‌కి వెళ్లి వార్డెన్‌ను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రార్థన విషయంపై విద్యార్థులను సైతం ఆరా తీశారు. ఈ వ్యవహారం మీడియాలో ప్రసారం అయిన నేపథ్యంలో ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి నివేదిక పంపాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రామకృష్ణను ఆదేశించారు. హాస్టల్ వార్డెన్, సిబ్బందితో పాటు రిటైర్డు పాస్టర్ అయిన భవన యాజమానిని విచారించాలని సూచించారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వార్డెన్ ఆర్.చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరుద్ర మహాయాగం నిర్వహణ

నల్లజర్ల: అవపాడులోని ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ ఆలయాల వద్ద మంగళవారం నుంచి 10వ తేదీ వరకు మృత్యుంజయ, పాశుపత, శ్రీరుద్ర మహాయాగ మహోత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు మంగళవారం వేద పండితులు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, ధ్వజారోహణం తదితర పూజాధికాలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిమధనం, మహా మృత్యుంజయ, పాశుపత, రుద్రహోమం, క్రమార్చన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

'మానవత'కు విరాళం

నల్లజర్ల: మానవత సంస్థ మండల మాజీ కార్యదర్శి ఉప్పాడ కామేశ్వరావు మనవరాలు తన్విక పుట్టిన రోజు సందర్భంగా ఆ సంస్థ నల్లజర్ల శాఖకు రూ.10 వేల విరాళం అందజేశారు. సంస్థ జిల్లా సమన్వయకర్త కండెపు వెంకట సూర్యనారాయణ మంగళవారం ఈ విషయం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: ఈనెల 3వ తేదీ రాత్రి దేచెర్ల గ్రామం జంక్షన్ వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న మన్నె వీర్రాజును ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకి తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడి మనవుడు తోట దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.